సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



ఉపాధి పనుల్లో అక్రమాలు

బుట్టాయగూడెం మండలంలో ఉపాధి హామీ పనుల్లో రూ.1.73 కోట్ల అక్రమాలు జరిగినట్టు అధికారులు గుర్తించారు.

8లో ▸



రోడ్డెక్కితే టెర్రరే

బాదంపూడి నుంచి ప్రత్తిపాడు వరకూ ఉన్న ప్రధాన రహదారి నరకాన్ని తలపిస్తోంది. భారీ గుంతలతో అధ్వానంగా మారింది.

8లో ▸



వృద్ధుడి ఆత్మహత్య

గుర్తుతెలియని వృద్ధుడు భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన తణుకులో చోటుచేసుకుంది.


8లో ▸

నీళ్లు నములుతున్న కమిషనర్

- అక్రమ లేఅవుట్‌కు నీటి సరఫరా కరెక్టే అని సమర్థింపు
- వాస్తవాలు రాసిన 'సాక్షి'కి వివరణ ఇచ్చిన వైనం
- కౌన్సిల్ తీర్మానంలో లేఅవుట్ వివరాలు ఎందుకు పెట్టలేదు ?
- నాన్ లేఅవుట్‌కు నీళ్లు ఎలా ఇస్తారని పట్టణవాసుల ప్రశ్న
- మిగిలిన నాన్ లేఅవుట్‌లకూ నీళ్లు ఇస్తారా అని అంటున్న వైనం



పాలకోడేరు మండలం విస్సాకోడేరులో పవన్ సుధా నాన్ లేఅవుట్ ముఖద్వారం



'సాక్షి'లో వచ్చిన కథనంపై ఇచ్చిన వివరణ

భీమవరం(ప్రకాశం చౌక్): పాలకోడేరు మండలం విస్సాకోడేరులోని పవన్ సుధ నాన్ లేఅవుట్‌కు భీమవరం మున్సిపాలిటీ నీటి సరఫరాను మున్సిపల్ అధికారులు సమర్థించుకున్నారు. 'సాక్షి'లో వచ్చిన 'గొంతెండుతుంటే నాన్ లేఅవుట్‌కు నీళ్లా?' శీర్షికన కథనానికి వివరణ ఇస్తూ తప్పు చేయలేదని పేర్కొన్నారు. అయితే ఆ వివరణలో నాన్ లేఅవుట్ లేక అప్రూవల్ లేఅవుట్ అనేది పంచాయతీకి సంబంధించిన విషయమని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అయితే నాన్ లేఅవుట్ లేక అప్రూవల్ లేఅవుట్ అనే విషయం తెలియకుండా కౌన్సిల్ తీర్మానంలో ఎలా పెడతారు? లేఅవుట్ వివరాలు లేకుండా ప్రత్యేక అధికారిగా ఉన్న జాయింట్ కలెక్టర్ కౌన్సిల్ తీర్మానంపై ఎలా సంతకం చేస్తారనే దానికి మాత్రం సమాధానం చెప్పలేదు. నిబంధనల ప్రకారం నాన్ లేఅవుట్‌కు మున్సిపల్ నీళ్లు ఇవ్వచ్చని ఉంటే ఎందుకు కౌన్సిల్ తీర్మానంలో నిబంధనల కాపీ జత చేయలేదు? ఇలా నాన్ లేఅవుట్‌లకు మున్సిపల్ నీళ్లు ఇచ్చుకుంటూ భీమవరం ప్రజలకు నీళ్లు లేకుండా చేస్తారా? అని భీమవరం పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. నాన్ లేఅవుట్‌కు నీళ్లివ్వడం కష్టమని విస్సాకోడేరు పంచాయతీ చేతులు ఎత్తేస్తే భీమవరం మున్సిపాలిటీ ఫీజులు కట్టించుకుని నీళ్లివ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర నాన్ లేఅవుట్‌లలోని వారు కూడా ఫీజులు చెల్లిస్తే నీళ్లిస్తారా.. అని ప్రశ్నిస్తున్నారు.

విమర్శల వెల్లువ

నాన్ లేఅవుట్‌కు మున్సిపాలిటీ నీటి సరఫరా చేస్తుంటే కలెక్టర్ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల్లో నీటి సరఫరా చేయాలని ఉన్నా.. నాన్ లేఅవుట్ అయినా ఫర్వాలేదు డబుల్ ఫీజులు కట్టించుకుని నీళ్లు సరఫరా చేయండి అని ఎక్కడా పేర్కొనలేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులు గుర్తించడం లేదు. మున్సిపల్ బైలా ప్రకారం నీళ్లు ఇస్తున్నాం అని మాత్రమే వివరణలో ఉంది. అయితే నాన్ లేఅవుట్‌కు కూడా ఫీజులు కట్టించుకుని నీళ్లు ఇవ్వచ్చని మాత్రం చెప్పలేదు.

మిగతా నాన్ లేఅవుట్‌లకు ఇస్తారా?

పవన్ సుధా లేఅవుట్‌కు తీర్మానాలు చేసి ప్రభుత్వం నుంచి ఆర్డర్ పాస్ చేయించి మున్సిపాలిటీ నీళ్లు సరఫరా చేస్తున్నట్టుగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు సమీపంలో ఉన్న నాన్ లేఅవుట్‌లకూ మంచినీటి సరఫరా చేస్తారా అన్నదానిపై జిల్లా ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

రాజకీయమా లేక అవినీతా ?

భీమవరంలో అనేక ప్రాంతాలకు పైప్‌లైన్ ఉన్నా మంచినీళ్లు అందడం లేదు. శివారు ప్రాంతాలకు పైపులైన్ వేసి నీళ్లు అందించాల్సిన మున్సిపాలిటీ పక్క నియోజకవర్గంలో నాన్ లేఅవుట్‌కు పైపులైన్ వేసి మరీ నీళ్లివ్వడం అనేది రాజకీయ ఒత్తిడా లేక అవినీతి చోటుచేసుకుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో 39 వార్డుల్లోని అన్ని ప్రాంతాలకు పుష్కలంగా నీళ్లు అందించడంలో లేని ఆసక్తి నాన్ లేఅవుట్‌పై ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. నాన్ లేఅవుట్‌కు దగ్గరలో ఉన్న మున్సిపల్ పైపు నుంచి పైప్‌లైన్ వేయాలని ఉండి ఎమ్మెల్యే సూచించారని తీర్మానంలో పేర్కొనడం గమనార్హం.

కృత్రిమ కొరతతోనే యూరియా సంక్షోభం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: యూరియా సంక్షోభానికి కృత్రిమ కొరతే కారణమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం కొయ్యలగూడెంలో వైఎస్సార్ సీపీ యూత్ నేత నూకల రాము ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న చేపట్టనున్న ఆర్డీఓ కార్యాలయాల ముట్టడి, ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి నాయకులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కి తరలించి కోట్లాది రూపాయల స్కామ్‌కి తెరదీశారని ఆరోపించారు. కొందరు ప్రజాప్రతినిధులు, నాయకుల చేతిలో కీలుబొమ్మగా మారిన కూటమి ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. చంద్రబాబు అంటేనే కరువు, కాటకాలకు దత్తపుత్రుడని ఎద్దేవా చేశారు. యూరియా కోసం రైతులు సొసైటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం తమ పార్టీలకు చెందిన వారికి మాత్రమే సుపరిపాలన అందిస్తూ ప్రజలను నట్టేట ముంచేస్తోందన్నారు. పార్టీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీపీ గంజిమాల రామారావు, మండల కో–కన్వీనర్ బిరుదుగట్ల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

బొజ్జగణపయ్యా.. యూరియా అందించవయ్యా

గణేష్ సెంటర్‌లో పునర్నిర్మించిన వినాయక ఆలయంలో బాలరాజు పూజలు చేశారు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు తీర్చాలని కోరారు.

న్యూస్‌రీల్

రేపు మధ్యాహ్నం ఆలయం మూసివేత



ద్వారకాతిరుమ చిన వెంకన్న ఆలయం

ద్వారకాతిరుమల: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఆదివారం మహానివేదన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మూసివేస్తామని ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. సోమవారం (8వ తేదీన) పుణ్యాహవాచనం అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే 7న సాయంత్రం జరగాల్సిన ఆర్జిత సేవలను, 8న వేకువజామున జరగాల్సిన సుప్రభాత సేవను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. మిగిలిన అన్ని సేవలు యథావిధిగా జరుగుతాయన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రుల సేవలో 'పశ్చిమ' మేటి

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను పేదలకు చేరువ చేయడంలో అధికారుల కృషికి నిదర్శనం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటించిన ఐవీఆర్ఎస్ ఫలితాలే సాక్ష్యం అని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో వివరాలు వెల్లడిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల సేవలపై 79.6 శాతం మంది అవును అని సమాధానం ఇచ్చారని, ఇది రాష్ట్రంలో 26వ జిల్లాల్లో అత్యధిక సంతృప్తి స్థాయి అని పేర్కొన్నారు. అలాగే రక్తపరీక్షలకు సంబంధించి 64.7 శాతం మంది, మందుల పంపిణీ గురించి 73.4 శాతం మంది, వైద్య సిబ్బంది అందించే సేవలపై 75.1 శాతం మంది సంతృప్తి చెందారని తెలిపారు. మొత్తంగా ప్రభుత్వ ఆసుపత్రి సేవల్లో 73.4 శాతం నమోదు చేసుకుని మొదటి స్థానంలో పశ్చిమగోదావరి నిలిచిందని కలెక్టర్ తెలిపారు. అధికారులను సమన్వయం చేసుకుని జిల్లాలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేసిన కలెక్టర్‌ను పలువురు అభినందించారు.

హాస్టళ్ల తరలింపు సరికాదు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: ప్రభుత్వ హాస్టళ్ల తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, వాటి బదిలీ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మెయిన్ సెంటర్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు చేపట్టిన ఆందోళన శిబిరానికి బాలరాజు వెళ్లి సంఘీభావం తెలిపారు. కొయ్యలగూడెంలోని ప్రభుత్వ బీసీ హాస్టళ్ల రెండింటినీ వేరే మండలాలకు తరలించడాన్ని తప్పుపట్టారు. విద్యార్థులు అత్యధిక శాతం హాజరయ్యే కొయ్యలగూడెంలోని హాస్టళ్లను తరలించడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. కూటమిలోని నాయకులు రాజకీయాలు మాని ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కొయ్యలగూడెం వల్లే పోలవరం అసెంబ్లీ స్థానాన్ని కూటమి గెలవగలిగింది అనేది జగమెరిగిన సత్యం అని, అయితే కొయ్యలగూడెంలో విద్యారంగాన్ని అణగదొక్కేలా కుట్రలు జరుగుతున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలతో కలి ప్రభుత్వ విద్యారంగాన్ని అడ్డుకోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, ఏఐఎస్ఎఫ్ నాయకులు డి.శివకుమార్, ఎం.క్రాంతి కుమార్, తాడిగడప ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాపై శ్రద్ధ చూపాలి

ఏలూరు(మెట్రో): ఎరువుల నిల్వలు తక్కువగా ఉన్న సొసైటీలకు యుద్ధప్రాతిపదికన సరఫరా చేయాలనీ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో ఎరువుల లభ్యత, సరఫరాలపై శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఎరువుల పంపిణీపై వ్యవసాయాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎరువుల నిల్వలు తక్కువగా ఉన్న పెదపాడు, పెదవేగి, ఏలూరు, దెందులూరు, కలిదిండి, ముదినేపల్లి, బుట్టాయగూడెం, చింతలపూడి, ఆగిరిపల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు 500 టన్నుల యూరియాను పంపామన్నారు. యూరియా పంపిణీ, రైతుల సందేహాల నివృత్తి కోసం ఏలూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 85004 21967, 89850 21117 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కలెక్టర్ నాగరాణి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం: దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ సీహెచ్ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం స్థానిక అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల బాధ్యత ఎనలేనిదన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మహోన్నతమైన వ్యక్తి అని, అందరికీ ఆదర్శనీయులన్నారు. భీమవరం ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చి ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దే గురువు పాత్ర అమోఘమైందన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, రాష్ట్ర మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.నారాయణ మాట్లాడారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 56 మంది ఉపాధ్యాయులకు పూలమాల వేసి, శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మత్స్యకార సంక్షేమ,అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లి పెద్దిరాజు, ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళీమోహన్, సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యాంసుందర్, సహాయ సంచాలకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం

- యూరియా కూడా అందించలేని దుస్థితి
- మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రైతులు కష్టాలు, కన్నీళ్లతో వ్యవసాయం చేస్తుంటే కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు యూరియా అందక అవస్థలు పడుతుంటే, యూరియా కొరతను అధిగమించలేక ఎరువులు, పురుగు మందులు తగ్గించి పండించాలంటూ చంద్రబాబు చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం తన చేతగానితనాన్ని రైతులకు ఆపాదించేలా మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. గతంలో వ్యవసాయం దండగన్న చంద్రబాబు నేడు కూడా అదే ధోరణి అవలంబిస్తున్నారని దుయ్యబట్టారు. గత పంట డబ్బులు ఇంకా చేతికి అందక, నేడు పంట చేలన్నీ నీట మునిగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా పట్టించుకున్న దాఖలాలే లేవని చెప్పారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు రూ.20 వేలు ఇస్తానన్న చంద్రబాబు నేడు కేంద్రం ఇచ్చిన మొత్తంతో కలిపి కేవలం రూ.7 వేలు మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. యూరియా కోసం రైతులు క్యూలో ఉండాల్సి వస్తోందన్న విషయాన్ని ప్రస్తావిస్తూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతుల పట్ల వెటకారంగా మాట్లాడటం బాధాకరమన్నారు. రైతులకు ఇంకా ధాన్యం డబ్బులు రాలేదంటే మంత్రి నాదెండ్ల మనోహర్ ఏం చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. మట్టి, ఇసుక, మద్యం వ్యవహారాల్లో ఎమ్మెల్యేలంతా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

కంటిచూపుతో చంపేస్తావా?

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కంటిచూపుతో చంపేస్తానంటూ మర్దరిస్టులా బెదిరిస్తున్న తీరు చూస్తుంటే మంత్రి స్థానంలోనే ఉన్నారా అని మాజీ మంత్రి కారుమూరి ప్రశ్నించారు. ఆయన వ్యవహారశైలి ఇబ్బందికరంగా మారిందన్నారు. తణుకులో ఆవులు, గేదెలను వధిస్తుంటే ఏంచేస్తున్నారని నిలదీశారు. తణుకులో మీరు వెలగబెట్టిన వ్యవహారాలు అందరికీ తెలుసునని, ఆ బాధితులు కూడా బయటకు వస్తున్నారని చెప్పారు. తణుకులో సొంత పార్టీవారే ఎమ్మెల్యేని నిందించే పరిస్థితి ఏర్పడిందంటే అతని పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. యూరియా కొరతపై ఈనెల 9న తాడేపల్లిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే పార్టీ కార్యక్రమానికి తణుకు నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లనున్నట్టు తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో గురువులకు సన్మానం



సన్మానం అందుకుంటున్న బొడ్డు రాంబాబు



సున్నం శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురుపూజా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువులను సన్మానించారు. రాష్ట్రవ్యాప్తంగా 16 మంది ఉపాధ్యాయులను సన్మానించగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బొడ్డు రాంబాబు, సున్నం శ్రీనివాసరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్‌కుమార్ రెడ్డి, గడ్డం సుధీర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.జాల్ రెడ్డి పాల్గొన్నారు.

కూటమికి కొమ్ముకాస్తున్న విద్యుత్ అధికారులు

పాములపర్రులో దళితుల నిరసన



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద దళితుల నిరసన

ఉండి: కూటమి నాయకులకు విద్యుత్ అధికారులు కొమ్ముకాస్తున్నారంటూ పాములపర్రు దళిత శ్మశాన వాటిక వద్ద శుక్రవారం దళితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత శ్మశాన వాటికలో గ్రామానికి చెందిన ఆక్వారైతు అక్రమంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మీటరు ఏర్పాటు చేయగా గతనెల 4న ఉండి విద్యుత్ ఏఈ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. అయినా పట్టించుకోకపోవడంతో తిరిగి గతనెల 22న ఎన్నార్పీ అగ్రహారంలో విద్యుత్ సమస్యలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని చెప్పారు. దీనిపై స్పందించిన విద్యుత్ అధికారులు 23న సదరు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశారన్నారు. అయితే కూటమి నాయకుల ఒత్తిళ్లతో ఈనెల 4న ట్రాన్స్‌ఫార్మర్‌కు తిరిగి విద్యుత్ సరఫరా ఇచ్చారని ఆరోపించారు. ముందుగా దళితులకు న్యాయం చేసినట్టు నటించిన విద్యుత్ అధికారులు ఇప్పుడు కూటమి నాయకులకు ఒత్తాసు పలకడం దారుణమన్నారు. దళిత శ్మశాన వాటికలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలా విద్యుత్ కనెక్షన్ ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

కదం తొక్కిన ఆటో కార్మికులు



భీమడోలులో భారీగా ఆటోల ర్యాలీ



భీమడోలు జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ప్రభుత్వ తీరుపై ఆందోళన

భీమడోలు: స్త్రీ శక్తి పథకం (ఉచిత బస్సు) మా పాలిట శాపంగా మారిందంటూ ఆటోడ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఒక్కో ఆటో కార్మికునికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం చేయాలంటూ శుక్రవారం భీమడోలు శ్రీవేంకటేశ్వర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భీమడోలు, పూళ్ల, గుండుగొలను ప్రాంతాలకు చెందిన 120 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. భీమడోలు జంక్షన్ వద్ద మానవహారం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారంతా భీమడోలు జంక్షన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అందించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఉచిత బస్సుతో ఆటో కార్మికుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని, వెంటనే కార్మికులకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మోదీ ప్రభుత్వం తెచ్చిన మోటార్ వెహికల్ చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలన్నారు. క్రూడాయిల్ తగ్గుతున్నా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని ఆటో కార్మికులను ఆదుకోవాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆటో యూనియన్ల అధ్యక్షులు సీరా సాంబశివరావు, డి.పైడియ్య, నల్లమిల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడు ముప్పిడి సతీష్, కార్యదర్శి రాచేటి యోహాన్, సిద్దాబత్తుల పండు, సంయుక్త కార్యదర్శి కూరపాటి సర్వేశ్వర రావు, కోశాధికారులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా ?





యూరియా ఇప్పించండి మహాప్రభో అంటూ రైతులు వేడుకుంటున్నారు. యూరియా ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతామంటూ ఆవేదన చెందుతున్నారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో, చాట్రాయి మండలం చనుబండలో సొసైటీ వద్ద శుక్రవారం యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతుల దృశ్యమిది.

– నూజివీడు

క్లుప్తంగా

గురువుల పాత్ర కీలకం



నిట్‌లో గురుపూజోత్సవం

తాడేపల్లిగూడెం: సమాజంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని శుక్రవారం ఏపీ నిట్‌లో జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు అన్నారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల పాత్ర సమాజంలో ఎంతో అమూల్యమైందన్నారు. గురువే విద్యార్థుల జీవితానికి మార్గదర్శి అన్నారు. విద్యార్థులను అజ్ఞానం నుంచి విజ్ఞాన వెలుగుల దిశగా నడిపించేది ఉపాధ్యాయులే అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అసోసియేట్ డీన్‌లు డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి ,శ్రీనివాసన్, ఆచార్యులు పి.శంకర్, కార్తికేయశర్మ, అమరేంద్రరెడ్డి, కిషోర్, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు..



దువ్వలో మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న ఎస్సై మధుబాబు

తణుకు అర్బన్: బెల్టు దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించినట్లు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో దువ్వ గ్రామానికి చెందిన ఇందుకూరి నాగరాజు, తేతలి గ్రామానికి చెందిన పంది గోగులు నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బెల్టు దుకాణాలు నిర్వహించినా, మద్యం దుకాణాల్లోని పర్మిట్ రూంలలో కాకుండా బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి

పోలవరం రూరల్: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరుతున్న నీటితో వరద ప్రవాహం కొనసాగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 32.250 మీటర్ల మేర నీటిమట్టం కొనసాగుతోంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 9.10 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోంది. భద్రాచలం వద్ద 40.90 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. వరద మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నేడు షార్ట్ ఫిలిం పోటీలు

పాలకొల్లు సెంట్రల్: జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నేడు లఘు చలన చిత్రాల పోటీలు నిర్వహించనున్నారు. శనివారం పట్టణంలోని బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న రామచంద్ర గార్డెన్స్‌లో ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ప్రదర్శనకు 30 లఘు చిత్రాలు రాగా వాటిలో 12 చిత్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనకు మరో ఆరు చిత్రాలను ఎంపిక చేశారు. ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్‌లో పాలకొల్లు పట్టణానికి చెందిన కళాకారుడు, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణను సన్మానించనున్నారు.

ప్రత్తిపాడు- బాదంపూడి రోడ్డెక్కితే టెర్రరే



ఈ రోడ్డుపై ఒళ్లు, బండ్లు గుల్లే..



సంక్రాంతికి రోడ్లు వేస్తామన్నారు. చివరకు అరకొర మరమ్మతులతో సరిపెట్టారు. తాడేపల్లిగూడెంలో ఒక్క ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేయకుండానే మమా అనిపించారు. బాదంపూడి నుంచి ప్రత్తిపాడు వరకూ ఉన్న ప్రధాన రహదారి తాడేపల్లిగూడెం పట్టణానికే కాకుండా, తణుకు, రావులపాలెం వంటి ప్రాంతాలకు ఎంతో కీలకం. తాము అధికారంలోకి రాగానే ఈ రోడ్డు వేస్తామని జనసేన ఎమ్మెల్యే ఊదరగొట్టారు. ఇప్పుడు ఏడాదిన్నర దాటినా కనీసం దీనివైపు కన్నెత్తి చూడడం లేదు. చిన్నాచితకా రోడ్లకు చేసినా మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఈ రోడ్డు నరకాన్ని తలపిస్తోంది. ఇటీవల పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారు. గతంలో చిన్నపాటి గోతులపై రాజకీయం చేసిన కూటమి నేతలు ఇప్పుడు భారీ గుంతలతో రోడ్లు అధ్వానంగా తయారైనా పట్టించుకోవడం లేదు. –పెంటపాడు



ఆదమరిస్తే.. ఇబ్బందే





నది రోడ్డులో భారీ గుంతలు



ఉపాధి పనుల్లో అక్రమాలు



సామాజిక తనిఖీ వేదికలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

బుట్టాయగూడెం: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా గత ఏడాదిపాటు జరిగిన గ్రామీణ అభివృద్ధి పనులు, పంచాయతీరాజ్, ఐటీడీఏ సోషల్ ఫారెస్ట్, టెరిటోరియల్ ఫారెస్ట్, కూలీలకు కలిపి సుమారు రూ. 16.27 కోట్ల నిధులకు సంబంధించి పనులు చేశారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందం అధికారులు ఆగస్టు 21 నుంచి ఒక్కొక్కటిగా పరిశీలించారు. పనుల వివరాలను మండల స్థాయిలో వెల్లడించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేదికలో బుట్టాయగూడెం మండలంలోని 21 పంచాయతీల పరిధిలో జరిగిన పనుల్లో సుమారు రూ.1.73 కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. కొలతలు, మస్తర్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పనులు, ఐటీడీఏ ద్వారా చేపట్టిన పనులు, తదితర పనుల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. వీటిలో రూ. 27.86 లక్షలను అధికారులు రికవరీకి ఆదేశించారు. మరో రూ.27 లక్షలకు సంబంధించి ఎంక్వైరీకి ఆదేశించినట్లు తెలిపారు. రూ.86.86 లక్షలతో వివిధ పనులతోపాటు మొక్కలు వేయించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రజావేదికలో రూ.66 లక్షలు తొలగించినట్లు చెప్పారు. అదేవిధంగా ఏపీఓ, ఈసీ, జేఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సుమారు రూ. 2.81 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్ఆర్‌పాలెంలో కాంపౌండ్ వాల్, రాజానగరం, లక్ష్మడుగూడెంలో పాల కేంద్రం నిర్మాణాలు చేపట్టకుండానే సుమారు రూ.8 లక్షల వరకూ డబ్బులు చెల్లించినట్లు గుర్తించామన్నారు. ఆ సొమ్ము మొత్తం రికవరీ చేసినట్లు తెలిపారు. డ్వామా పీడీ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జ్యోతి, ఏపీఓ ఎం.స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9:30 వరకూ ఈ కార్యక్రమం జరిగింది.

చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నాం

శ్రీవారి దేవస్థానం ఎస్ఎంఆర్ ఉద్యోగుల ఆవేదన



ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీవారి దేవస్థానం ఎస్ఎంఆర్ ఉద్యోగులు.

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ దేవస్థానం ఎస్ఎంఆర్ ఉద్యోగులు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసలకు శుక్రవారం వినతి పత్రాలను అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ను వారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలసి, తమ సమస్యలను వివరించారు. ఆ తరువాత దుశ్శాలువాలు కప్పి, శ్రీవారి చిత్రపటాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తాము శ్రీవారి దేవస్థానంలో సుమారు 25 ఏళ్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. చాలీచాలని జీతంతో పనిచేస్తూ, ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. దేవస్థానం ఎస్టాబ్లీష్‌మెంట్ చార్జెస్ 30 శాతం లోపు ఉంటే ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదని, తమ దేవస్థానం ఎస్టాబ్లీష్‌మెంట్ చార్జెస్ కేవలం 16 శాతం లోపే ఉందని పేర్కొన్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రస్తుతం ఆలయంలో పనిచేస్తున్న ఎస్ఎంఆర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయొచ్చన్నారు. అప్పుడు కూడా హుండీల ద్వారా వచ్చే ఆదాయంతోనే తమకు జీతభత్యాలు అందుతాయని, ప్రభుత్వంపై ఎటువంటి భారం పడదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెగ్యులర్ అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ ఉద్యోగులు చవలం శ్రీనివాసరావు, సర్నాల రంగారావు, విజ్జురోతి కుంకుళ్లు, గోపా బాలు, నాగేశ్వరరావు, మంగరాజు తదితరులున్నారు.

వరద ముంపులోనే కనకాయలంక ప్రజలు



కనకాయలంకలో పడవలపై కాజ్‌వే దాటుతున్న గ్రామస్తులు

యలమంచిలి: గోదావరిలో వరద స్థిరంగా ఉండిపోవడంతో కనకాయలంక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంక చుట్టూ వరద చుట్టుముట్టడంతో ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం పడవల మీద ప్రయాణిస్తున్నారు. గత నెల 29న వరదముంపునకు గురయిన కాజ్‌వే మీద ఎనిమిది రోజులుగా వరద నీరు ప్రవహిస్తుంది. ముఖ్యంగా తాగునీటి కోసం లంక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో తాగునీరు దొరకడం లేదు. దీంతో ప్రతి ఒక్కరూ చాకలిపాలెం వెళ్లి ఫౌండేషన్ నీరు తెచ్చుకుంటారు. మామూలు సమయంలో బైక్, సైకిల్ మీద తెచ్చుకుంటారు. వరద రావడంతో పడవపై తెచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో ఒంటరి మహిళలు తాగునీరు తెచ్చుకోవడం కష్టమవుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం కనీసం వాటర్‌టిన్స్ పంపిణీ చేయాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

ఏలూరు టౌన్: జిల్లా వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పదవులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా చిలకపాటి డింపుల్ జాబ్, కార్యదర్శిగా అచ్యుత కుమారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొత్తపల్లి రాణి, పోల్నాటి పరమేశ్వరి నియమితులయ్యారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా తోటకూర కిషోర్, సెక్రటరీలుగా మట్టా రాజు, మండపాటి కిషోర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రావి సునీల్, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా కొండ యశ్వంత్, సెక్రటరీ బోనగిరి మధుకుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చాత్రగడ్డ సౌజన్య, కే.మోహన చంద్రను, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా బల్లవరపు తిరుపతి స్వామి, సెక్రటరీలుగా డెక్కటి జయరామిరెడ్డి, బంకురు వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నక్కా రాము, మచ్చా దుర్గారావును, సోషల్ మీడియా వింగ్ ప్రధాన కార్యదర్శిగా బండ్లమూడి సునీల్‌కుమార్, సెక్రటరీ దొవులూరి రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చుండూరి పూజిత్, సిరికోటి వైష్ణవనాథ్ నియమితులయ్యారు. వీవర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా కొండపల్లి పరమేశ్వరరావు, సెక్రటరీ చిట్యాల ఠాగూర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మాదాబత్తుల శేఖర్, సురిశెట్టి ఉదయ్‌భాస్కర్‌ను నియమించారు.

బైబిల్ విరుద్ధమైన బోధనలు అడ్డుకుంటాం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

పాలకొల్లు సెంట్రల్: బైబిల్‌కు విరుద్ధమైన బోధనలు చేసే వారిని అడ్డుకుంటామని తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్.ఎబినేజర్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారు అడబాల గార్డెన్స్‌లో జరుగుతున్న క్రైస్తవ తైలాభిషేకం ఆరాధన కార్యక్రమాన్ని పాలకొల్లు తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి సభ్యులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా గార్డెన్స్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. కొంత కాలంగా ప్రార్థనా శక్తి నిర్వాహకుడు ఇస్సాక్ అడబాల గార్డెన్స్‌లో ప్రతి నెలా మొదటి శుక్రవారం తైలాభిషేకం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలంటూ స్థానిక తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచి నిరసన చేపట్టారు. సంఘ అధ్యక్షుడు ఎబినేజర్ మాట్లాడుతూ అమాయక ప్రజలను, విశ్వాసులను మభ్యపెట్టి ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. ఆరాధన ఆదివారం మాత్రమే జరగాలని.. అలా కాకుండా ఏ రోజైనా చేస్తే వాక్యానికి విరుద్ధమన్నారు. తైలాభిషేకం బైబిల్‌లో ఎక్కడా లేదని, అందువల్ల ఈ బోధనను ఖండించేందుకు నిరసన చేపట్టామన్నారు. బోధకుడు ఇస్సాక్ అనుచరులు వచ్చి కోర్టు ఆర్డర్ ఉందని చెప్పారని.. అయితే కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదన్నారు.

సంచార జాతులకు ఏం చేశారో చెప్పాలి?



సమావేశంలో మాట్లాడుతున్న సంచార జాతుల సంఘం వ్యవస్థాపకుడు పెంద్ర వీరన్న

కాళ్ల: సంచార జాతులకు బీజేపీ ప్రభుత్వం తరపున న్యాయం చేస్తామని విజయవాడలో నిర్వహించిన సంచార జాతుల దినోత్సవం సభలో బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారని, గత 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సంచార జాతులకు ఏం చేసిందో చెప్పాలని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న కౌంటర్ ఇచ్చారు. పెద అమీరంలోని జిల్లా పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డీఎన్టీ, ఎన్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని, ఆ నెపం రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టి వేయడం సరికాదన్నారు. మతం పేరుతో ఓట్ల కోసం ఈ జాతులను వాడుకోవటం సరికాదని, సర్టిఫికెట్లు ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ చేసి భారత రాజ్యాంగంలోని 341, 342 ఆర్టికల్ పరిధిలోకి తీసుకొచ్చి న్యాయం చేయాలన్నారు. గతంలో అనేక కమిషన్లు కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చాయని ఇంతవరకు చర్చకు కూడా తీసుకురాకుండా ఈ వర్గాలకు న్యాయం చేస్తామని అబద్ధాలు చెప్పడం మాధవ్ మానుకోవాలని పెంద్ర వీరన్న అన్నారు. ఆగస్టు 31న ప్రధానమంత్రి మోదీ ఏం అద్భుతమైన సంక్షేమ పథకాలు ప్రకటించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సంచార జాతులకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1288.44 కోట్ల లబ్ధి చేకూర్చిందన్నారు. గుర్తింపు లేని సంచార జాతులను గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించే కార్యక్రమానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంచార జాతుల సంఘ జిల్లా అధ్యక్షుడు చుండూరి ముసలయ్య, ప్రధాన కార్యదర్శి చింత వీర్రాజు, కార్యదర్శి చుండూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య



తణుకు సూర్యాలయం వీధిలో భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడు

తణుకు అర్బన్: గుర్తుతెలియని వృద్ధుడు భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి తణుకులో జరిగింది. తణుకు సూర్యాలయం వీధిలోని ప్రైవేటు ఆస్పత్రి భవనం పైనుంచి దూకగా.. మృతుడికి 65 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారంతో ఘటనా ప్రాంతానికి వెళ్లిన ఎస్సై ప్రసాద్ సీసీ ఫుటేజీ పరిశీలించారు. వృద్ధుడు ఆస్పత్రిలోకి వచ్చి మెట్ల మార్గంలో మూడో అంతస్తులోకి వెళ్లి రెయిలింగ్‌పై నుంచి దూకినట్లుగా నిర్ధారించారు. పైనుంచి కిందపడిన వెంటనే తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి చొక్కా జేబులో బిస్కట్ ప్యాకెట్ తప్ప మరే వివరాలు లేకపోవడంతో ఆ వృద్ధుడు ఎవరనేది తెలియరాలేదు. దీంతో మృతదేహాన్ని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి ఫొటోతోపాటు వివరాలను పోలీసులు పలు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో వివరాలు బయటపడ్డాయి. అత్తిలి మండలం బల్లిపాడులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కాకర్ల ఆదినారాయణ (65)గా పోలీసులు గుర్తించారు. ఉదయం 10 గంటలకు ఇంటినుంచి బయటకు వచ్చిన ఆదినారాయణ మళ్లీ రాలేదని కుటుంబసభ్యులు చెప్పారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. ఎస్సై ప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

పెదవేగి: ఒక వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి మండలం భోగాపురంలో శుక్రవారం సాయంత్రం పాత కక్షల నేపథ్యంలో మండపాక నాగేంద్ర వరప్రసాద్‌పై పామర్తి రామచంద్రరావు, అతని మనుమడు పవన్ సాయిలు కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన పెదవేగి మండలం భోగాపురంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పెదవేగి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ఎర్రనీలిగుంటలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: ప్రకృతి విధానాల్లో సాగుచేస్తూ డ్రోన్ సాయంతో పిచికారి చేయడం వల్ల సమయం ఆదా అవుతుందని జోనల్ కోఆర్డినేటర్ గద్దే వెంకటరత్నం అన్నారు. అత్తిలి మండలం ఎర్రనీలిగుంట గ్రామంలో శుక్రవారం సామూహికంగా డ్రోన్ సాయంతో కషాయాలు, బయో కల్చర్‌పై రైతులకు వివరించారు. రైతులు ఎరువులు పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాలు వాడటం వల్ల ఖర్చు తగ్గుతుందని అన్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని చెప్పారు. తణుకు డివిజన్ ఇంచార్జ్ వై లక్ష్మి, టి గంగాధర్‌రావు, గూడూరు శ్రీనివాసు, రాంబాబు, కట్ట వెంకన్న, సానబోయిన కనకరాజు, ఏవో టీకే రాజేష్ పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



బలుసులమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మకు శుక్రవారం విశేష పూజలు జరిగాయి. దాతలు లింగాల శేషు, వరలక్ష్మి కమలాదేవి, షణ్ముఖ్ ఈశ్వర్, పెద్దాడ ఇందిరా ప్రవల్లిక, గీతానంద్ పార్వతి కాంత్‌లు సహాయ సహకారాలతో అన్నదానం జరిగింది. భక్తులు తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను శ్రీరంగం అంజి పర్యవేక్షించారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయాలి

ఉండి: ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం యండగండిలో ఈ-పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆయనే స్వయంగా నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి 10500 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 9500 ఎకరాల ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసారని మిగిలిన 1500 ఎకరాలను త్వరలోనే పూర్తి చేసి నూటికి నూరుశాతం పూర్తి చేయాలన్నారు.అలాగే రైతులంతా తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీ, ఇతర పథకాలకు అర్హులు కారని సూచించారు. అలాగే అన్ని ల్యాండ్ పార్సెల్స్‌కి సంబంధించిన డేటాను డిజిటల్ క్రాఫ్ సర్వే(డీసీఎస్)లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస్, ఏఈఓ పరంజ్యోతి, ఊర్మిళ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన



ఉండిలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉండి: ఖాళీ ప్రదేశాల్లో, వివిధ వస్తువుల్లోనూ నిల్వ ఉండే నీటిలో దోమలు పెరుగుతాయని వాటివల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని జిల్లా వైద్య కార్యాలయ అధికారులు ఆరిమిల్లి ఎస్ఎస్ఎన్ మూర్తి,రమేష్‌వర్మ అన్నారు. స్థానిక జంగాల కాలనీలో వైద్య సిబ్బంది శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు మాట్లాడుతూ వాడకం నీరు, వర్షపు నీరు వంటివి గుంటల్లోను, ఖాళీ ప్రదేశాల్లో ఏవైనా వస్తువుల్లోను నిల్వ ఉంటే మనకెందుకులే అనుకుంటాం కానీ వాటిలో దోమలు పెరగడంతో పరిసరాల పరిశుభ్రతకు తీవ్ర విఘాతం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఆర్ కృష్ణకుమార్, వెంకటేశ్వర్లు, పి. జ్ఞానరాజు, అనూష, లక్ష్మీ, సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.

కానరాని మండల ప్రత్యేక అధికారులు

ఆకివీడు: మండల ప్రత్యేక అధికారులు అడ్రస్సు లేకుండా పోయారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకాధికారులు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలతో మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సి ఉంది. ప్రత్యేక అధికారులు ప్రత్యేక సమయాల్లోనే హాజరవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్, మంత్రులు వచ్చిన సమాయాల్లో మాత్రమే హాజరవుతున్నారని, మండలస్థాయిలో జరిగే కార్యక్రమాలకు గైర్హాజరవుతన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండల ప్రత్యేక అధికారుల వ్యవస్థను పటిష్టపరచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న తెలంగాణ గణనాథులు



తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని తెలంగాణ గణనాథుడు



తణుకు సజ్జాపురంలో లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలోని తెలంగాణ గణనాథుడు



తణుకు యర్రాప్రగడ వారి వీధిలో బొజ్జ గణపతి యూత్ ఆధ్వర్యంలోని తెలంగాణ గణనాథుడు

- ప్రతి ఏటా ఒక్కో రకమైన రూపంలో ఏకదంతుడు
- విగ్రహాలను చూసేందుకు భారీగా తరలివస్తున్న భక్తులు
- జై గణేశా నామస్మరణలతో నిమజ్జనాలు

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా తణుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లోని విగ్రహాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ నుంచి ప్రత్యేక వాహనాల్లో తీసుకువచ్చిన గణనాథుడి విగ్రహాలను చూసేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ నుంచి తీసుకువచ్చిన భారీ గణనాథుడి విగ్రహ రూపం ప్రతి ఏడాది భక్తులను అలరించే విధంగా రూపుదిద్దుకుంటుంది. సజ్జాపురంలోని మూడు రోడ్ల సెంటర్‌లో లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహోత్సవాల్లో ఈ ఏడాది 14 తలల దేవతా మూర్తులతో రూపొందించబడి ఉన్న భారీ గణనాథుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తణుకు సుధ హస్పిటల్ వెనుక ప్రాంతంలోని యర్రాప్రగడ వారి వీధిలో బొజ్జ గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో విఘ్నేశ్వరుడి తలపై భాగంలో సర్పాలు, శివుడి విగ్రహంతో పాటు నంది, శివలింగంతో రూపొందించిన గణనాథుడి భారీ విగ్రహం కన్నులపండువగా ఉంది. ఈ మూడు విగ్రహాలు తణుకులో ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో భక్తులు భారీ సంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు వస్తున్నారు.

తెలంగాణ నుంచి....

తెలంగాణలో ప్రత్యేకంగా విగ్రహాలను తయారుచేసే ప్రాంతాలకు ప్రత్యేకంగా వాహనాన్ని తీర్చిదిద్ది ఉత్సవ కమిటీ యువకులు స్వయంగా వెళ్తారు. విగ్రహాన్ని వాహనం పైకి ఎక్కించి దారి పొడవునా విద్యుత్ తీగలను తప్పిస్తూ శ్రమపడి విగ్రహాలను కొన్నేళ్లుగా తణుకుకు తీసుకు వస్తున్నారు. గణనాథుడి విగ్రహాలకు తగ్గట్లుగా భారీగా మండపాలను రూపొందించి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నిమజ్జనాల్లో సైతం పూజాధికాల అనంతరం ప్రత్యేక వాహనాలపైకి ఎక్కించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి తణుకు గోస్తనీ కాలువలో నిమజ్జనాలు చేస్తున్నారు.

ఉల్లి మార్కెట్‌ను తనిఖీ చేసిన జేసీ



ఉల్లి మార్కెట్‌లో అమ్మకాలను పరిశీలిస్తున్న జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఉల్లిపాయల గుత్త మార్కెట్ బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌ను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతమున్న కర్నూలు ఉల్లి రకం ధరలను రైతులను, గుత్త వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. వేలం విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. క్వింటాలుకు 1,310 రూపాయలు పలకడం అభినందనీయమన్నారు. ఉల్లి పండించిన వ్యాపారులు నష్టపోకుండా వీలైనంత వరకు మంచి ధరకు ఉల్లిపాయలను కొనుగోలు చేయాలని వ్యాపారులను కోరారు. ఆయన వెంట ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ భానో, తహసీల్దార్ సునీల్ కుమార్, మార్కెటింగ్ ఏడీ సునీల్, తదితరులు ఉన్నారు.

బాణసంచా అక్రమ నిల్వలు చేస్తే కఠిన చర్యలు

బాణసంచాను అక్రమ నిల్వలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. 32వ వార్డులో ఉన్న ఎల్ఈ -5 లైసెన్సు కలిగి ఏర్పాటుచేసిన బాణసంచా విక్రయదుకాణం పరిశీలించారు. దుకాణం నిర్వాహకులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణం ఏర్పాటుచేశారా, అగ్నిమాపక అధికారుల నిబంధనల ప్రకారం జాగ్రత్తలు తీసుకున్నారా ఏర్పాటు చేసిన పరికరాల పనితీరును పరిశీలించారు.

ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే సహించేది లేదు



ప్రత్తిపాడులో ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో మార్క్‌ఫెడ్ ఎరువుల గోడౌను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే సహించేది లేదన్నారు. రైతులకు కావాల్సిన యూరియా ఉందన్నారు. ఈ ఎరువలను స్థానిక పీఏసీఎస్ సొసైటీ ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. రైతు సేవా కేంద్రంలో కూడా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే సీజన్‌కు కూడా యూరియా తెప్పించుకొని నిల్వ ఉంచుకొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించి 553 మెట్రిక్ టన్నుల యూరియా గోడౌన్‌లో సిద్ధంగా ఉంచామన్నారు. ఈ తనిఖీలో ఆర్డీఓ, జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వర్లు, ఏడీఏ గంగధర్, వ్యవసాయాధికారులు నారాయణరావు, రవికుమార్, తహసీల్దార్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



17వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక యాగర్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 17వ వార్డు నవ్వారు పేటలో శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం జరిగింది. వర్షకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మలేరియా, చికెన్ గునియా, ఫైలేరియా వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు పెరుగుదలకు కారణమైన నీటి నిల్వలను ప్రతి శుక్రవారం తొలగించాలని కోరారు. హెల్త్ సిబ్బంది తదితరులచే ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కాంతారావు, ప్రసాద్, హెల్త్ సెక్రటరీ సూర్య చంద్ర, ఆశ కార్యకర్త కృష్ణవేణి పాల్గొన్నారు.

మండపాక పీడీ సూర్యనారాయణకు రెండు అవార్డులు



అవార్డులతో పీడీ సూర్యనారాయణ

తణుకు అర్బన్: తణుకు మండలం మండపాక ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయునిగాను, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును దక్కించుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో అవార్డులు అందుకున్నట్లు సూర్యనారాయణ తెలిపారు. ఒకేరోజు రెండు జిల్లా అవార్డులు గెలుచుకున్న సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఫణిశ్రీ, పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు ప్రశంసించినట్లు తెలిపారు.

సులభతరంగా 'విద్య'



వివిధ బోధన పరికరాల ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు గుదే సుబ్బారావు

తాడేపల్లిగూడెం రూరల్: నేటి ఆధునిక ప్రపంచంలో విద్యను సులభతరంగా విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాడేపల్లిగూడెం మండలం మాధవరం ఏఏ-1 పాఠశాల ఉపాధ్యాయుడు గుదే సుబ్బారావు బొమ్మల ద్వారా విద్యను సులభతరంగా అందిస్తున్నారు. దాదాపు 25 రకాల బోధన పరికరాల ద్వారా విద్యార్థులకు బోధిస్తున్నారు. కోవిడ్ సమయంలోనూ విద్యార్థుల విద్య గాడి తప్పకుండా యూట్యూబ్ ద్వారా బోధించడం విశేషం. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియలను అనుసరిస్తున్నాని గుదే సుబ్బారావు తెలిపారు. భట్టీ పట్టే విధానానికి స్వస్తి చెబుతూ విద్యార్థుల మనస్సుల్లో గుర్తుండిపోయేలా బొమ్మలు, పరికరాల ద్వారా విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. ఒక పక్క ఉపాధ్యాయునిగా సేవలందిస్తూనే సామాజిక అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగానే గ్రామస్తులను భాగస్వామ్యం చేసి రూ.20లక్షలు విలువైన 60 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేసి పాఠశాల అదనపు గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పించడం విశేషం.

కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదు



జగన్నాథపురంలో ఆర్ఎస్‌కు జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు వెళితే తగిన గుణపాఠం తప్పదని సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో సీపీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, 60 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు అందించాలన్నారు. అనంతరం సీపీఎం గ్రామ కార్యదర్శిగా సిద్ధాబత్తుల నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. పి.బాయమ్మ, గుమ్మడి కేశవ, శంకవరం మహాలక్ష్మి, గుదే పాపమ్మ పాల్గొన్నారు. అలాగే, జగన్నాథపురం, ఇటుకులగుంట గ్రామంలో సీపీఎం ఉద్యమ నిర్మాత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసమస్యలపై ఆర్ఎస్ సాగించిన పోరాటాలను వివరించారు. సీపీఎం నాయకులు పీలా గాదినాయుడు, గజ్జరపు వెంకటేశ్వరరావు, పీలా వెంకటేశ్వరరావు, కండెల్లి రమేష్‌బాబు, పీలా అప్పాయమ్మ, పాలుపూరి సత్యవతి, మల్లిపూడి సీతామహాలక్ష్మి, పాలుపూరి పుష్ప, పి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు మంజూరు చేయాలి



విద్యార్థులతో ఐసా నాయకుల సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ కళాశాల బాలురు వసతి గృహంలో శుక్రవారం విద్యార్థులతో సమావేశం జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ దశాబ్దాల తరబడి సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు మంజూరు చేయాలని విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నప్పటికి ప్రభుత్వాలు పరిష్కారం చూపడం లేదని ధ్వజమెత్తారు. సంక్షేమ హాస్టల్స్ కళాశాల వసతి గృహాలు అద్దె భవనాలలో కొనసాగడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇరుకు గదులలో విద్యార్థులు వసతి పొందుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.అనిల్, ఎం.చందు, కె.హర్ష. బి.రాజు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట ఉప్పరగూడెంలో పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: జూదక్రీడలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.28,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తెలిపారు. మరో ముగ్గురు జూదక్రీడలో ఉన్నట్లు గుర్తించామన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి



తణుకులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అచంచల విద్యామేధస్సుతో ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున ఉపాధ్యాయ దినో త్సవాన్ని నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి కారు మూరి వెంకట నాగేశ్వర రావు అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కారుమూరి మాట్లాడు తూ మానవ సమాజ అభివృద్ధికి ఆయన కృషికి గుర్తింపుగా భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న బిరుదు పొందారని గుర్తుచేశారు. రాష్ట్రపతిగా ఆయన అందించిన సేవలు దేశ గౌరవా న్ని ఇనుమడింపచేశాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, యిండుగపల్లి బలరామకృష్ణ, జల్లూరి జగదీష్, నూకల కనక దుర్గ, నత్తా కృష్ణవేణి, పుల్లెపు సూర్యచంద్రరావు, కొమ్మోజు రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ, యారబాటి రామకృష్ణ, బిరుదుకోట చింతన్న, పైడి సాయిసూర్య, ఎస్వీ జాకబ్‌బాబు, షేక్ జిలాని, వన్నెంరెడ్డి మురళీమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సం

అత్తిలి: రేపటి సమాజ అభ్యున్నత నేటి ఉపాధ్యాయుల చేతులలోనే ఉందని పాఠశాల స్కూల్ డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం బల్లిపాడు మదన గోపాల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. ఉప నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. గురువులకు పాద పూజ చేసి తమ గురు భక్తిని చాటుకున్నారు. ఉపాధ్యాయులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో హెచ్ఎం బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆకుల శ్రీనివాస రావు, శివకృష్ణ, అనిత, గీతా భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా టీచర్స్ డే

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మసీద్ సెంటర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను నవభారత్ స్వచ్ఛంధ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ఎంపీ వైద్యులు, సమితి అధ్యక్షుడు మొహమ్మద్ కపర్ది, రాకుర్తి కిరణ్ కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

కైండ్‌నెస్ ఆధ్వర్యంలో...

పట్టణంలో ఘనంగా టీచర్స్ డేను నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం కైండనెస్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యాలయంలో మాజీ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పర్యవేక్షణలో గురువులకు సన్మాన కార్యక్రమాలు జరిగాయి. చైర్మన్ సీహెచ్ నాగరాజు, జిల్లా చైర్‌పర్సన్ జి.ప్రవీణ్ కృష్ణ, కరిబండి రామకృష్ణ, పాల్గొన్నారు.

బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో...

స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్తమ ఉపాధ్యాయులు చామన సూర్యచంద్రరావు, మైనం సత్యనారాయణ, దాసరి ధనలక్ష్మి, టి.రవికుమార్, యంత్రపాటి ధనలక్ష్మిలకు సత్కారాలు జరిగాయి. బుద్దాల వెంకట రామారావు, పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, వేమూరి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

డైమండ్స్ ఆధ్వర్యంలో...

డైమండ్స్ ఆధ్వర్యంలో స్థానిక వాసవి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు కేవీ కృష్ణారావు, బీవి రాజేంద్ర, భవిత ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి, మేరీ వజ్రమ్మ, కుంట్ల కనక దుర్గ, ఆర్.ఉదయ్ కుమారి, కె.వెంకట లక్ష్మి, పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గురువులు ఉత్తమ విద్యను అందించాలి

పెంటపాడు: ఉపాధ్యాయులు విద్యార్థులకు మానవత్వాన్ని ప్రబోధించేలా బోధనలు సాగాలని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మానవత జిల్లా నాయకులు తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఆశయాల ప్రకారం మానవత విలువలు నశించిపోకుండా ఉపాధ్యాయులుకూడా మానవతను ఆదరించాలన్నారు. సమాజహిత కార్యక్రమాలు చేస్తున్న సభ్యులను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాస్, టీవీ ఆర్కే, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండంలో 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మానవత నాయకులు తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



అత్తిలి: బల్లిపాడులో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



పెంటపాడు: డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం

వీఓఏల సమస్యలను పరిష్కరించాలి

భీమవరం: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమవరంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నాగిడి గోవిందమ్మ అధ్యక్షతన వీఓఏల జిల్లా విస్తృత సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవ రావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు గ్రూపులు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి రెవెన్యూ తెస్తున్న వీఓఏలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. వీఓఏలకు కనీస వేతనం రూ. 26 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.